తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# జిల్లాకు కొత్త కలెక్టర్ లక్ష్మీషా

## తిరుపతి నగరపాలక కమిషనర్‌గా అదితిసింగ్
## రేపోమాపో జిల్లా ఎస్‌పి బదిలీ




నూతన కలెక్టర్ లక్ష్మీషా, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్

తిరుపతి,జనవరి 28ప్రభాతవార్త:
సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో మూడేళ్ళు ఒకేచోట పనిచేస్తున్న ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా ,పారదర్శకంగా నిర్వహించేందుకు కసరత్తులో ఇప్పటికే రాజకీయపరంగా పోస్టింగ్‌లు తెచ్చుకుని కొనసాగుతున్న ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను బదిలీలు చేపడుతోంది. తాజాగా ఆదివారం సాయంత్రం రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులు(జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ల)ను ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రభుత్వం బదిలీ చేయకతప్పలేదు. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండిగా ఉన్న లక్ష్మీషాను నియమించింది. ఇక్కడ తిరుపతి జిల్లా తొలికలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని ఆ స్థానంలో నియమించారు. తిరుపతి నగరపాలకకమిషనర్‌గా ఉన్న డి.హరితను ఏపియుఎఫ్‌ఐడిసి ఎండిగా బదిలీ చేసింది. ఈ స్థానంలో విజయవాడ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న అదితిసింగ్‌ను నియమించింది. మరో రెండురోజుల్లో తిరుపతి,చిత్తూరు జిల్లాల ఎస్‌పిలు, అదనపు ఎస్పీలు కూడా బదిలీ కానున్నారు. ఆయా స్థానాల్లో కొత్త అధికారులు నియమితులుకానున్నారు. కాగా ఇప్పటికే జిల్లా కలెక్టర్,ఎస్‌పిలను మార్చిన ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణకు ముందే అధికారులు ఎక్కడైనా చిన్నపొరబాట్లు, తప్పిదాలు చేసినా బదిలీ వేటు తప్పదు.

# దళితులంటే అంత అలుసా..!?

## సత్యవేడు సమావేశం మంత్రి పెద్దిరెడ్డి ఇంట్లోనా ?
## ఎమ్మెల్యే ఆదిమూలం మండిపాటు
## దళితులకు మందు, కారు పెట్టి తరలిస్తారా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జనవరి 28 ప్రభాతవార్త :
దళితులంటే అంత అలుసా అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రశ్నించారు. ఆదివారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తన నియోజక వర్గంలో జరగాల్సిన ఆత్మీయ సమావేశాన్ని తనకు మాటవరసకైనా చెప్పకుండా తిరుపతిలోపెద్దిరెడ్డికిచెందినకళ్యాణమండపంలోఎలా నిర్వహిస్తారని ఆదిమూలం మండిపడ్డారు. సత్యవేడునియోజకవర్గంలోప్రకృతి సంపద అంతా దోచుకున్నది మంత్రిపెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, అతని తనయుడు ఎంపిమిథున్‌రెడ్డి లేనని ఆరోపించారు.తనకుసత్యవేడు సీటును కేటాయించకపోయినా తిరుపతి ఎంపి సీటును సిఎం జగనన్న ఇచ్చారన్నారు.తనకు సత్యవేడు ఎమ్మెల్యే సీటు కావాలని జగన్‌మోహన్‌రెడ్డిని అడిగినా ఆయన తిరుపతి ఎంపిగా చేయమని ఆదేశిస్తే అంగీకరించానని, అయితే సత్యవేడు ఎమ్మెల్యేగా నిజాయితీగా పనిచేస్తూ, పార్టీకి విధేయుడిగా వున్న తనను కనీసం మాట వరుసకు కూడా చెప్పకుండా సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన ప్రస్తుత తిరుపతి ఎంపి గురుమూర్తికి తన నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం పెద్దిరెడ్డి తిరుపతిలోఎలానిర్వహిస్తారని ప్రశ్నించారు. పెద్దిరెడ్డికి దమ్ము, ధైర్యం వుంటే తిరు పతి, నగరి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల సమావేశాలను నిర్వహించాలని సవాల్ విసిరారు. ఆయన ప్రతాపం అంతా దళిత నియోజక వర్గాలలోనే అని ఎద్దేవా చేశారు.తాను 1977 నుంచి రాజకీయాలలో వున్నానని,తాను మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి అనుచరుడిగా వున్నానని,ఆయన మంత్రిగా జిల్లాలో ఓ వెలుగువెలిగిన రోజుల్లో ఇదే పెద్దిరెడ్డి మోటర్‌సైకిల్‌పై చెంగారెడ్డి వద్దకు వచ్చేవాడని,అలాంటి వ్యక్తికి ఈ రోజు ఇన్ని వేల కోట్ల రూపాయల ఆస్తి ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం తాను ఇంకా ఎమ్మెల్యేగా కొనసాగుతున్నానని,తనకు తెలియకుండా పెద్దిరెడ్డి మనుషులు తమ నియోజక వర్గంలో తిరుగుతూ సమావేశాలు పెట్టుకోవడం ఎంతవరకు సమంజస మన్నారు. ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా మీటింగ్‌లు పెట్టుకోవడం ఎక్కడి న్యాయమన్నారు. పెద్దిరెడ్డికి పార్టీ మీద అంత ప్రేమ వుంటే ఆత్మీయ సమావేశాన్ని సత్యవేడు నియోజక వర్గంలోని ఏడు మండలాలలో ఎక్కడైనా పెట్టుకోవచ్చని,తనకు మాట వరసకు చెప్పివున్నా తానే ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసేవాడినన్నారు. ఎన్నికలు నోటిఫికేషన్ ఇంకా రాలేదు, ఇప్పటికీ తానే సత్యవేడు ఎమ్మెల్యే అని తన అధ్యక్షతన జరగాల్సిన సమావేశాన్ని పెద్దిరెడ్డి హైజాక్‌చేసి తన సొంత కళ్యాణ మండపంలో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.తమ కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేసి సమావేశాలు జరిపినంత మాత్రాన ఒరిగేది ఏమీలేదని, తాను నిరంతరం ప్రజల్లోనే వున్నానని,తాను కానీ తన బంధువులు కానీ కంకర,మట్టి,ఇసుక లోడ్లకొద్దీ తమిళనాడుకు తరలించలేదని, వారిలా ఎలాంటి దోపిడీలకు పాల్పడలేదని ఆదిమూలం అన్నారు.తన నియోజక వర్గంలో కంకర,ఇసుక,మట్టి దోపిడీ అంతా పెద్దిరెడ్డి అనుచరుల కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు.

సంపద మొత్తం వారే దోచుకున్నా, నామి నేటడ్ పోస్టులన్నీ వారు సూచించిన వ్యక్తులకే ఇచ్చినా జగన్ కోసం, పార్టీ కోసం సహించానని,వారు చేసే దోపిడీని,అరాచకాలను చూస్తూ వుండేందుకు తాను నిశానినికాదని, తనకు చదువు,సంస్కారంవుందని ఆదిమూలం అన్నారు. దళితులకు కారు ఏర్పాటుచేసి మందు, బిర్యానీ ఇచ్చి లొంగ పరుచుకోవడం అనుకుంటే అది పొరపాటేనని, తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలనుకుంటే చూస్తూ సహించమని హెచ్చరించారు. తనకు జరిగిన అన్యాయానికి ముఖ్యమంత్రి స్పందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాట తప్పిన జగన్

## వైఎస్ఆర్ వారసుడేనా!? - ప్రజలకు ఏం జవాబు చెబుతావు?
## రామమందిరం కట్టిన మోదీ హామీలు మరిచారు
## ఐదేళ్ళలో హంద్రీ నీవా,గాలేరు నగరి ప్రాజెక్టులకు నీరివ్వలేదే : పిసిసి చీఫ్ షర్మిల విమర్శలు



తిరుపతి,జనవరి 28ప్రభాతవార్త:
2019 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి నేత వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తామని, సాగునీరిస్తామని ఇచ్చిన హామీ 60నెలలు కావస్తున్నా పూర్తిచేయలేకపోయాడని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. ఉమ్మడిచిత్తూరు జిల్లాలో గాలేరు నగరి ప్రాజెక్టును ఐదేళ్ళలో అటకెక్కించాడని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి కట్టిన ప్రాజెక్టులను పూర్తిచేయలేని మీరు వయన వారసులుగా ఎలా చెప్పుకుంటారని అన్నారు. వైఎస్ఆర్ హయాంలో వచ్చిన నీళ్ళే తప్ప వారసులు ఒక్క ఎకరాకు కూడా నీళ్ళుఇవ్వలేదని ఘాటుగా విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాటమీద నిలబడే నాయకుడని, వైఎస్ జగన్ మాట ఇచ్చి నెరవేర్చలేని నాయకుడని అన్నారు. ఎన్నికల సమయంలో దశలవారీగా మద్యపాన నిషేధం చేసిన తరువాత మళ్ళీ ఓటు అడుగుతానని, లేకుంటే ఓటు అడగనని చెప్పిన జగన్ మద్యంపై అప్పులు తెచ్చి ఇప్పుడు నిషేధం ఎక్కడ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పిసిసి చీఫ్‌గా వైఎస్ షర్మిల తొలిసారి ఆదివారం ఉదయం తిరుపతిలో ఓ కల్యాణమండపంలోని దామోదర సంజీవయ్యప్రాంగణంలో జరిగిన తిరుపతి,చిత్తూరు జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమలో హంద్రీ-నీవా,గాలేరు -నగరి ప్రాజెక్టులు కనీసం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రానికి ఏం చేశారని ,ప్రజలకు చేసిన మంచి పనులు ఏవో చెప్పాలని నిలదీశారు.మేనిఫెస్టో అంటే బైబిల్,ఖురాన్, భగవద్గీత లాంటిది అన్న జగన్ ప్రతి మాట తప్పిన జగన్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. వైఎస్ఆర్ హయాంలో తిరుపతి జిల్లాలో మన్నవరం ప్రాజెక్టు నిర్మించాలని, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో శంకుస్థాపన కూడా చేయించారన్నారు. 6వేల కోట్ల రూపాయలతో ఎలక్ట్రికల్ పరికరాల తయారీ పరిశ్రమ ప్రాజెక్టు పూర్తిచేయాలనుకున్న తరువాత మోదీ ప్రదానిగా మన్నవరం మూలనపడిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ కూడా ఈ ప్రాజెక్టు ఊసే ఎత్తలేదని ఎద్దేవాచేశారు. బిజెపికి బానిసలుగా ఉన్న టిడిపి, వైసిపిలను తరిమికొట్టాలని, ఆ పార్టీల హామీలు ఎండగట్టాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని, హామీలు అమలవుతాయని ప్రతి కార్యకర్త సైనికుడిలా మారి ప్రజలకు వివరించాలన్నారు. అమరావతి రాజధానిని నాశనం చేసిన జగన్ మూడు రాజధానులు కడుతానని చెప్పి ఒక్క రాజధాని కూడా లేని రాష్ట్రంగా తయారుచేశారని షర్మిల మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏఐసిసి, రాష్ట్రకాంగ్రెస్ పార్టీ నాయకులు జెడి శీలం, రఘువీరారెడ్డి, పల్లంరాజు, కొప్పులరాజు, గిడుగురుద్రరాజు,డాక్టర్ చింతామోహన్, ప్రమీలమ్మ, గౌడపేరచిట్టిబాబు,వెంకటనరసింహులు, రాంభూపాల్‌రెడ్డి, తిరుపతి కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు యార్లపల్లి గోపీ,చిత్తూరు,తిరుపతి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ తన కుమారుడు డాక్టర్ చింతా భరత్, కుమార్తె డాక్టర్ చింతా నీనాలను షర్మిలకు పరిచయం చేశారు.

# నగరి నుంచే పోటీ చేస్తా

## - మంత్రి రోజా స్పష్టం

తడ, జనవరి 28 ప్రభాతవార్త



నగరి అసెంబ్లీ నియోజక వర్గం నుంచే తాను మళ్లీ పోటీ చేస్తానని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం ఆమె తడ మండలం భీములవారిపాలెం వద్ద టూరిజం రిసార్ట్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు పచ్చ మీడియాతో సృష్టిస్తోందని, కానీ వరుసగా రెండుసార్లు తనను ఆదరించిన నగరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచే ఈ సారి కూడా పోటీ చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఇదంతా మొదటి నుంచి తనపై జరుగుతున్న పచ్చ మీడియా కుట్ర మాత్రమేనని ఆమె అన్నారు. మొదట్లో తనకు సీటు రాదని ప్రచారం చేశారని, ఇప్పుడు వేరేచోటికి వెళ్లి పోటీ చేస్తానని మరో కథనం వేశారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు భయపడుతున్నారని ప్రతిపక్షాలను ఎద్దేవా చేశారు. కొందరు నాయకులు ఇతర రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెత్తనం చేయాలని చూస్తున్నట్లు రోజా అన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్, షర్మిల వంటి వారు.. తిరిగి వారు ఎక్కడ ఓటు హక్కు కలిగి ఉన్నారో ఆ రాష్ట్రానికి వెళ్లిపోవడం ఖాయమని రోజా పేర్కొన్నారు. మంత్రి ఆర్‌కె రోజా పర్యటనలో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దెల గురుమూర్తి హాజరు కాకపోవడం విశేషం. పర్యాటక శాఖ వారు పులికాట్ లేక్ వ్యూ రిసార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామితో పాటు రోజా, ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా హాజరవుతారని ముందుగా పేర్కొన్నారు. ఆంధ్రా,తమిళనాడు సరిహద్దుల్లోని పులికాట్ సరస్సు ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ప్రస్తుత తిరుపతి జిల్లా తడ మండలం భీములవారిపాలెం వద్ద రాష్ట్ర పర్యాటక శాఖ వారు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి రిసార్టులు నిర్మించారు. అయితే కొన్ని దశాబ్దాలుగా అక్కడ శిలాఫలకాలు మాత్రమే కనిపించేవి. చివరికి 15 ఏళ్ల క్రితం 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రిసార్టులకు శంకుస్థాపన చేసింది. 15 ఏళ్ల అనంతరం వాటిని అధికారికంగా ప్రైవేటు వారికి అప్పగించి ఆదివారం ప్రారంభించడం విశేషం.

# జిడినెల్లూరు వైకాపా అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచన

## - మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం డిప్యూటీ సిఎం ముమ్మర ప్రయత్నం
## - ఎంపీ అభ్యర్థిగానే పోటీకి రెడ్డప్ప వుండటానికి ఇష్టం

చిత్తూరు, జనవరి 28 ప్రభాతవార్త:
చిత్తూరు ఎంపీ, జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నియామకాలపై వైకాపా అధిష్టానంకు ఇప్పటి వరకు ఒక స్పష్టత రాలేదు. ఇటీవల వైకాపా అధిష్టానం చిత్తూరు ఎంపీగా వున్న రెడ్డప్పను జిడి నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, ప్రస్తుతం జిడినెల్లూరు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం నారాయణ స్వామిని చిత్తూరు ఎంపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఖరారు చేసిన విషయం విదితమే. జిడినెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీగా మరోసారి డిప్యూటీ సిఎం నారాయణస్వామికి పార్టీ అధిష్టానం అవకాశం కల్పించనుందని కొన్ని రోజులుగా విస్తృతంగా ప్రచారం జరుగడంతో ఆయన వ్యతిరేకులు పెనుమూరు మండలం పులిగుండులో సమావేశం నిర్వహించి నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా మరొకసారి డిప్యూటీ సిఎం నారాయణస్వామిని నియమిస్తూ ఆయనను ఓడిస్తామని పార్టీ అధిష్టానంకు హెచ్చరికలు జారీ చేశారు. దీనిపై పునరాలోచించిన వైకాపా అధిష్టానం కసరత్తు చేసి ప్రస్తుతం చిత్తూరు ఎంపీగా వున్న రెడ్డప్పను జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, డిప్యూటీ సిఎం నారాయణస్వామిని చిత్తూరు ఎంపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఖరారు చేస్తూ జాబితా విడుదల చేసింది. ఈ పరిస్థితుల్లో డిప్యూటీ సిఎం నారాయణస్వామికి చిత్తూరు ఎంపీ అభ్యర్థిత్వం ఖరారు చేస్తే జిడినెల్లూరు అసెంబ్లీ స్థానంలో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం అధికంగా వుంటుంది. వైకాపా అధిష్టానం జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి డిప్యూటీ సిఎం నారాయణస్వామికి అవకాశం కల్పించకపోయినా చిత్తూరు ఎంపీ స్థానం అభ్యర్థిగా ఖరారు చేస్తే ఆయన వ్యతిరేక వర్గం ఈ ఎన్నికల్లో కచ్చితంగా ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేసే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం చిత్తూరు ఎంపీ రెడ్డప్ప సైతం జిడినెల్లూరు నుండి అసెంబ్లీకి పోటీ చేయడం కంటే చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. కుప్పంలో శనివారం జరిగిన సమావేశంలో సైతం ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ తాను మరోసారి ఇక్కడి నుండి ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో వుంటానని తనను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయడంతో చిత్తూరు ఎంపీ, జిడినెల్లూరు అసెంబ్లీ స్థానాల ఇన్‌ఛార్జీలపై వైకాపా అధిష్టానం ఇప్పటికీ తర్జన భర్జన పడుతున్నట్లు స్పష్టమవుతుంది. ఈ క్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి సైతం తనకు నియోజక వర్గంలో మంచి పట్టు వుందని తనకు అభ్యర్థిత్వం ఖరారు చేస్తే గెలిచి చూపిస్తానని చెప్తున్నారు. అలాగే డిప్యూటీ సిఎం నారాయణస్వామికి మరోసారి అభ్యర్థిత్వం ఖరారు చేయాలని నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని వైకాపా నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కి పోటీగా పార్టీ అధిష్టానంకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో వైకాపా అధిష్టానం చిత్తూరు ఎంపీ, జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా ఎవరిని నియమిస్తారనే విషయంపై వైకాపా నాయకులు, కార్యకర్తల్లో ఆసక్తి నెలకొంది.

# సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలి

## సాధికారిత సదస్సులో డిప్యూటీ సీఎం,నారాయణస్వామి



కోట,జనవరి 28 ప్రభాతవార్త
ముఖ్యమంత్రిగా మళ్లీ ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు గెలిపించుకోవాలని లేకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, చంద్రబాబు ఆ పథకాలను ఇవ్వాలేరని డిప్యూటి సీఎం, నారాయణ స్వామి అన్నారు. ఆదివారం కోటలోని సామాజిక సాధికారిక సదస్సు గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో డిప్యూటి సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశాం. తద్వారా చెప్పాడంటే చేస్తాడు అని జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని పేర్కొన్నారు. ఇది ఒక్కరి పార్టీ కాదు అందరి పార్టీ అందుకే నా ఎస్టీ,ఎస్సీ,బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పదవులు, నియామకాల్లో అగ్రభాగం కల్పించారని గుర్తు చేశారు.ఈ 70 రోజులు ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌పికి ఒక సైన్యంలా పని చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, పేద ప్రజల మీద ప్రేమతో ,భాత్యతతో 56 నెలల కాలంలో అమలు చేస్తున్న పథకాలే మనకు రానున్న ఎన్నికలకు బాణాలు, అస్త్రాలు, ఈ యుద్ధంలో 175 కు 175 వైస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్ గెలుపే మన లక్ష్యం దేవుడి దయతో ప్రతి ఇంటికి ప్రాతానికి ఊరికి చేసిన మేలుతో గెలవలన్నారు. తనకు జగనన్న ప్రమోషన్ ఇచ్చారని రెండు సార్లు జగన్న దయతో శాసన సభ్యులుగా ఒక సారి మంత్రిగా పని చేసే అధృష్టం జగనన్న కల్పించారని అన్నారు.తన వాణీని ఈసారి పార్లమెంట్‌లో కనిపిస్తానని చెప్పారు. రాజ్యసభ్యులు విజయసాయి రెడ్డి, బీదమస్తాన్‌రావు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, కోవూరు శాసన సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య, వైకాపా సిఈసి సభ్యులు కొడవలూరు ధనుంజయ రెడ్డి, వైకాపా కార్యదర్శి, పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, వైకాపా జాయింట్ సెక్రటిరి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్,నరమాల వెంకటరమణయ్య, కోట మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి, ఉలయకాయాల ప్రసాద్, మోభిన్‌బాష, సర్పంచ్ వెంకటరమణమ్మ, కోట,వాకాడు, చిట్టమూరు మండలాల కన్వీనర్లు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డు బాగుపడేదెప్పుడో..?

## పట్టించుకోని అధికారులు
## అవస్థలు పడుతున్న ప్రయాణీకులు



వడమాలపేట, జనవరి 28 ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఎస్‌వీ పురం రైల్వే బ్రిడ్జి కింద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలకు ఎప్పుడు మరమ్మ తులు చేస్తారంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి-చెన్నై జాతీయ రహదారి ఎస్‌వీ పురం రైల్వే బ్రిడ్జి కింద గత నాలుగు నెలలుగా ఊట నీరు వస్తుండడంతో రోడ్డు పాడైంది. రోడ్డుపై ఉన్న గుంతల్లోనీరు ఉండడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ నీళ్లు వెళ్ళడానికి కాలువ నిర్మించారు. అది పూడిపోయింది. నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా అధికారుల్లో స్పందన కలగడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి నీళ్ల నిల్వకుండా చర్యలు తీసుకుని, రోడ్డులోని గుంతలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్వీ పురం రైల్వే బ్రిడ్జి కింద పాడైన రోడ్డు

# ఆదిమూలం కుమ్మక్కురాజకీయాలు మానుకోవాలి

## -తిరుపతి ఎంపి గురుమూర్తి



తిరుపతి,జనవరి 28ప్రభాతవార్త:
సత్యవేడు ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం తన నియోజకవర్గ ప్రజలకు ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారని, ప్రజలు ఆయన ఇంటివద్దకు వెళితే ఆయన కుమారుడి తీరుపై నొచ్చుకుంటున్నారని తిరుపతి ఎంపి,తాజా సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. ఆదిమూలం కుమ్మక్కు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. తనపరిధిలోకి వచ్చే ప్రాంతంలో పర్యటించేందుకు ఎమ్మెల్యేకు పలుమార్లు ఫోన్‌చేశానని, నియోజకవర్గంలోకి వెళ్ళక ముందే ఆదిమూలం ఇంటికివెళ్ళానని గురుమూర్తి తెలిపారు. సత్యవేడు ఎమ్మెల్యేగా ఉన్న ఆయనను తిరుపతి ఎంపి అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నియమించారని అన్నారు. దళితుల పట్ల జగన్‌కు ఉన్న అభిమానం, గౌరవం ఏ పార్టీలో లేదన్నారు. అలాంటిది ఏదేని సమస్య ఉంటే అదిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలిగానీ, ఇతర పార్టీలతో ఒప్పందాలు పెట్టుకుని పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిదికాదని అన్నారు. సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవసారి ఆదిమూలంకు టిక్కెట్ కేటాయించకపోవడంతో ఆయన అసంతృప్తితో పార్టీపై,సీనియర్ నాయకులపై బురదజల్లుతున్నారని ఎంపి గురుమూర్తి ఆదివారం రాత్రి మీడియాతో స్పందించారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు భక్తులు మృతి

నారాయణవనం, జనవరి 28 ప్రభాతవార్త :
పుత్తూరు-చెన్నైజాతీయ రహదారిలోని నారాయణవనం మండలం గోవింద ప్పనాయుడుకండ్రిగ బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు గోవిందమాలతో పాదయాత్రగా నడిచి వస్తున్న వారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. ఒకరు సంఘటన జరిగిన ప్రాంతంలో మృతిచెందగా, మరొకరు తిరువళ్లూరు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తమిళనాడు రాష్ట్రం శ్రీపెరంబూరు సమీపంలోని కాట్రపాకంకు చెందిన గోవింద మాల భక్తులు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. ఆదివారం తెలవారు జామున 6గంటలకు గోవిందప్పనాయుడుకండ్రిగ బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియనివాహనం ఢీకొనడంతో మోహన్(45) గాయపడి అక్కడక్కడే మృతి చెందాడు. అతనితో పాటు నడిచి వస్తున్న మరొక భక్తుడు వరదన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన తర్వాత మెరుగైన వైద్యసేవల కోసం తిరువళ్లూరులోని ఓ ప్రయివేటుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త

కుప్పం డికెపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తొమ్మిదో వార్డు తెలుగుయువత అధ్యక్షుడు వెంకటాచలం మృతి చెందిన విషయం విదితమే. దీంతో సోమవారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంకు నివాళులు అర్పించారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరపున 25వేల ఆర్థికసాయాన్ని వారికి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు మాణిక్యం, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ మృతదేహంకు అంత్యక్రియలు



కుప్పంరూరల్, జనవరి 29 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి డికెపల్లి మాజీ సర్పంచ్ మణి మరోమారు తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఇతని తరపు ఎవరూ రాలేదు. దీంతో కుప్పం రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు మాజీ సర్పంచ్ మణికి సమాచారం ఇవ్వడంతో ఆయన ముందుకు వచ్చి అనాథ మృతదేహానికి డికెపల్లి చెరువు సమీపంలోని స్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## బండతిప్పనపల్లికి దేశం నేతలచే రోడ్డు సౌకర్యం



శాంతిపురం, జనవరి 29 ప్రభాతవార్త

మండలంలోని రాళ్లబూదుగూరు పంచాయతీ బండతిప్పనపల్లి గ్రామానికి వెళ్లే కాలిబాట రోడ్డు వెడల్పు పనులను దేశం నేతలు చేపట్టారు. గత కొన్నేళ్లుగా ఈరోడ్డు వెడల్పుకు గ్రామస్తులు ప్రయత్నించగా ప్రైవేట్ భూముల యజమానులు అంగీకరించలేదు. దీంతో స్థానిక తెదేపా నేతలు చొరవ చూపి భూముల యజమానులతో చర్చించి రోడ్డు వెడల్పుకు వారు అంగీకరించేలా చొరవ చూపారు. దీంతో సోమవారం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ స్థానిక నేతలతో కలసి భూమిపూజ చేసి రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రభుత్వం రాగానే తారురోడ్డు నిర్మిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు మణి, విశ్వనాథనాయుడు, నాగరాజు, చంద్రశేఖర్, జయరాజ్, బసవరాజు, కుమార్, యుగంధర్, శంకర్, మురళి, ఎంఆర్ నారాయణ, శ్రీనివాసులు, రవి, సుబ్రమణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైకాపా యూత్ ప్రధాన కార్యదర్శిగా అజయ్‌కుమార్‌రెడ్డి



రామకుప్పం, జనవరి 29 ప్రభాతవార్త

మండల వైకాపా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా రాజుపేట పంచాయతీకి చెందిన అజయ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు నియామక పత్రాన్ని అందించారు. అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపిలు రెడ్డెప్ప, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, మండలకన్వీనర్‌బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెదేపా నేత మృతి.. నేతల సంతాపం

రామకుప్పం, జనవరి 29 ప్రభాతవార్త

మండలంలోని కె ఒచనబల్లకు చెందిన తెదేపా నేత గంగప్ప మృతి చెందారు. దీంతో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి తదితరులు మృతదేహంకు నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం పదివేలరూపాయలు అందించారు. కార్యక్రమంలో నేతలు పట్ర నారాయణాచారి, రామలింగారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్యాయత్నం

పలమనేరు, జనవరి 29, ప్రభాతవార్త:

ఓ బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన పలమనేరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాలిక తల్లిదండ్రుల కథనం మేరకు ... మొరం పంచాయితీ నక్కపల్లె గ్రామానికి చెందిన మునస్వామి కూమార్తె (19) ఓ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. ఇటీవల కొంత కాలంగా ఆదే గ్రామానికి చెందినజయక్రిష్ణ తరచూ బాలికను వేదిస్తున్నట్లు, ఆ వేదింపులు తాళలేక ఉదయం సమీపంలోని చెరువులో ఆత్మహత్యకు పాల్పడగా స్థానికులు గుర్తించి బాలికను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, జనవరి 29 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీనివాస్ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ



కాణిపాకం, జనవరి 29 ప్రభాతవార్త:

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మీ సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆమెకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. చిత్తూరు సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మీ, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ బాడ్మింటన్‌లలో మోహితకు ద్వితీయ బహుమతి



వెదురుకుప్పం, జనవరి 29 ప్రభాతవార్త :

ఆడుదాం ఆంధ్ర పోటీలలో నియోజకవర్గం స్థాయిలలో షటిల్ బాడ్మింటన్ పోటీలలో ద్వితీయ బహుమతిని వెదురుకుప్పం మండలంకు చెందిన పోటూగారి మోహిత అందుకున్నట్లు చెప్పారు. డిసీసీ ప్రెసిడెంట్ పోటూగారి భాస్కర్, కాపుమొండివెంగనపల్లె పంచాయితీ సర్పంచ్ పోటూగారి లలిత దంపతుల రెండవ కుమార్తె మోహిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సచివాలయం, మండల, నియోజకవర్గం స్థాయిలో రాణించి ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఆమె ప్రతిభకు పలువురు ప్రముఖులు అభినందించారు.

## దళితుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం



కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దళితుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ వెంకటేష్, విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంను మంత్రి పెద్దిరెడ్డి అవమానించారని, దళితులను ఇంట్లో పనిమనుషులుగా వాడుతారా అని ప్రశ్నించారు. మైనింగ్, ఇసుక, గ్రావెల్ దోచిన మంత్రి పాపాల పెద్దిరెడ్డి అన్నారు. బ్లాక్‌మనీతో వచ్చే ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు సిద్ధమవుతున్నారన్నారు. సిఎం జగన్‌రెడ్డి దళితుల స్థానాలు మార్చుతున్నారని అదే రెడ్లస్థానాలను ఎందుకు మార్చడం లేదని ప్రశ్నించారు. గతంలో మంత్రి పెద్దిరెడ్డి ఓ సమావేశంలో డిప్యూటీసిఎం నారాయణస్వామిని నిలబెట్టారన్నారు. దళితులకు విద్య, రాజకీయపరంగా గుర్తింపు ఇచ్చింది తెదేపా అధినేత చంద్రబాబునాయుడేనన్నారు. విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్ మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్, వైకాపాలో పనిచేసినా తగిన గుర్తింపు లేదన్నారు. అదే తనను చంద్రబాబు గుర్తించి పార్టీ విస్తరణ కమిటీలో అవకాశ ం కల్పించారన్నారు. సమావేశంలో నేతలు సుబ్బు, బాలాజీ, మంజు పాల్గొన్నారు.

## చిల్లర దుకాణంలో కర్ణాటక మద్యం పట్టివేత

శాంతిపురం, జనవరి 29 ప్రభాతవార్త

మండలంలోని కడపల్లిలో ఓ చిల్లర దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని చిత్తూరు సెబ్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. అయితే ఈ దుకాణం ఓ అధికార పార్టీ నేతకు చెందినదిగా తెలిసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే అధికారులపై ఒత్తిళ్లు రావడంతో కేసు నమోదు చేయలేదని సమాచారం.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ధర్నా

చిత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:



రాష్ట్రవ్యాప్తంగా విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో తగ్గించిన అడిషినల్ క్వాంటమ్‌ను యధావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లు పునరుద్దరించాలని, అరియర్స్ వెంటనే చెల్లించాలనీ, అలాగే పెండింగ్‌లో వున్నడిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ పరిధి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.నాగరాజ, శివకుమార్, క్రిష్ణమనాయుడు, ప్రభాకరనాయుడు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా పే కార్యక్రమం విజయవంతం

చిత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:



నేడు ప్రారంభించిన పరీక్షా పే కార్యక్రమంలో ప్రధాని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకుప్రధాని వివరణాత్మకంగా సమాధానాలు ఇవ్వడంతో కార్యక్రమం విజయవంతమైందని బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా తెలిపారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, సోషల్‌మీడియా, సెల్‌ఫోన్ల ప్రభావం, ప్రణాళిక బద్దంగా చదవడం ఎలా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తదితర అంశాలపై చర్చ రసవత్తరంగా సాగిందన్నారు. కాగా గిరింపేట పురసాలక ఉన్నత పాఠశాలలో పరీక్ష పే చర్చా కార్యక్రమంను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబుతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, బిజెపి నాయకులు పాండియన్, రాసం ఉదయ్, రెడ్డిమస్తాన్, సోమనాథ్, సాయి ప్రతాప్‌లు తదితరులు వీక్షించారు.

## మనోహరనాయుడు మృతి పార్టీకి తీరని లోటు

చిత్తూరురూరల్, జనవరి 29 ప్రభాతవార్త:

రైతాంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు నడిపిన తెలుగుదేశం పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహరనాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి పేర్కొన్నారు. కాగా సోమవారం ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘననివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

## వైకాపా ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెన్నరాయుడు

చౌడేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త



వైకాపా ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెన్నరాయుడు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్నందుకొన్నారు. తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయనతోపాటు పూతలపట్టు జయశంకర్, జిల్లా సహాయ కార్యదర్శులుగా గంగాధరనెల్లూరు కుప్పయ్య, రత్నకిషోర్‌లు నియామక పత్రాలందించిన వారిలో వున్నారు. అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప, వైకాపా మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరదన గోవిందయ్య, తదితరులు నూతనంగా ఎంపికయిన జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు.

## ఎస్టీయు జిల్లా కార్యవర్గంలోకి చౌడేపల్లి ఉపాధ్యాయులు

చౌడేపల్లి, జనవరి 29 ప్రభాతవార్త



ఎస్టీయు జిల్లా నూతన కార్యవర్గంలోకి చౌడేపల్లి నుంచి 4గురు ఉపాధ్యాయులకు స్థానం కల్పించినట్లు ఆసంఘ మండలాధ్యక్షుడు లింగమూర్తి తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా కాసుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిగా పి.ఆంజనేయులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రట రీగా టి.రామకృష్ణ, సాంస్కృతిక ప్రచార కమిటీ సభ్యుడుగా జి.రవీంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నా రన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతోపాటు సంఘాన్ని బలోపేతం చేయడంలో మండల ఎస్టీయుశాఖ కనబరచిన చొరవకు జిల్లా కార్యవర్గంలోకి 4గురిని తీసుకొన్నట్లు ఆయన వివరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చెరువులో పడి వ్యక్తి మృతి

– ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

దొరవారిసత్రం, జనవరి 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఉచ్చూరు సమీపంలోని చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారిపడి ఓవ్యక్తి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరా లిలా ఉన్నాయి. సూళ్లూరుపేట మండలం మంగళంపాడుకు చెందిన హరినాథ్ (47) కూలీ పనుల నిమిత్తం ఈ నెల 26న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అప్పటి నుంచి హరినాథ్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఉచ్చూరు సమీ పంలోని చెరువులు గుర్తుతెలియని మృతదేహం బయటపడింది. మృత దేహాన్ని పరిశీలించగా హరినాథ్‌గా స్థానికులు గుర్తించారు. ఎస్ఐ జె.తిరుమలరావు, శవాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శిక్షణ తరగతులు ప్రారంభం

కోట, జనవరి 29 ప్రభాతవార్త




కోట మండలం విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సోమవారం వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయబులిటీ స్కిల్స్ అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. వీటిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజ యకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడుతూ వాద్వాని ఫౌండేషన్ మధ్య జరిగిన అవగాహన ఒప్పందంలో భాగంగా అధ్యాపక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులు థర్డ్ బిటెక్, ఫోర్త్ బిటెక్ చదువుతున్న విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వాతిపుత్రన్ మాట్లాడుతూ వాద్వాని ఫౌండేషన్ గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు వేగవంతం చేయడం లక్ష్యమన్నారు. అమెరికాలోని భారత సంతతికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మశ్రీ గ్రహీతడాక్టర్ రమేష్ వాద్వానీ ఈ ఫౌండేషన్ నెలకొల్పారని, దీని ద్వారా ఆఫ్రికా, ఏషియా, లాటిన్ అమెరికాలోని వివిధ దేశాల్లో ఎంట్రప్రెన్యూర్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఎంప్లాయబులిటీ స్కిల్స్ వంటి తదితర అంశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నిరంతరం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్ఓడి డాక్టర్ సిహెచ్ విక్రమ్‌కుమార్, ఎస్.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు, పురోహితులకు పంచాంగాల వితరణ

కోట, జనవరి 29 ప్రభాతవార్త



కోటలోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీసీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 50 మంది అర్చకులు, పురోహితులకు ఉపాధ్యాయ దంపతులు సూరపురాజా నాగరాజు, వెంకటకామాక్షి దంపతులు రూ.9 వేలు విలువ చేసే పంచాంగాలుఅందజేశారు. ప్రసాద్‌బాబు, శేషస్వామి, చలపతి, సాయిబాబా, చంద్రమౌళి, కృష్ణప్రసాద్, ఎస్‌విక్రిష్ణమూర్తి, స్వామి, పవన్‌తదితరులుపాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో తమిళ రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, జనవరి 29 ప్రభాతవార్త



స్థానిక బాపూజీ కాలనీలో తమిళనాడు నుంచి అక్రమంగా తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్‌అధికారులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకు న్నారు. బాపూజీ కాలనీలో నివసిస్తున్న సామర్ల రమేష్ ఇంటి వద్ద 115 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. మొత్తం 5550 కేజీల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ ఓబయ్య తెలి పారు. ఈ బియ్యం తమిళనాడు ప్రాంతం నుంచి అక్రమంగా తీసుకొచ్చి వాటం బేడు గ్రామానికి చెందిన మీజూరు హరనాథ్ నిల్వ చేసినట్లు ఆయన తెలిపారు.

## టిటిడి అటవీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు నాయకులు డిమాండ్

గూడూరు, జనవరి 29, ప్రభాతవార్త

టిటిడి అటవీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గూడూరు సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాల యం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల ఐదు నెలలుగా టిటిడి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టిటిడి పాలక మండలి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చొరవ తీసుకొని అటవీ కార్మికుల సమస్యలను పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సురేష్, బివి రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, పామంజి మణి, గుర్రం రమణయ్య, కెవిపిఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్, ఏస్‌కె ఆషిఫ్, వెంకటేశ్వర్లు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ననిమేల భాస్కర్‌రావు

గూడూరు, జనవరి 29 ప్రభాతవార్త



గూడూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ననిమేల భాస్కర్‌రావు, టౌన్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరిగా పర్వతాల శ్రీను నియమితులయ్యారు. సోమవారం గూడూరులోని కాంగ్రెస్ కార్యాలయం లో తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు పంట శ్రీనివా సులుఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పూల చంద్రశేఖర్, తిరుపతి జిల్లా సెక్రటరి చిలుకూరి వేమయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండి భాస్కర్‌రెడ్డి, కలువాయి మండల అధ్యక్షులు నిజమాల చిన్నయ్య పాల్గొన్నారు.

## తప్పులు తడకలుగా ఓటర్ల జాబితా ఉంటే చర్యలు

బాలాయపల్లి, జనవరి 29, ప్రభాతవార్త



మండలంలో ఓటర్ల జాబితా తప్పులు తడకగా ఉండడంతో తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఓలతో తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటి తహశీల్దార్ శిరీష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, ఎపిక్ కార్డులను బిఎల్‌ఓలకు తహశీల్దార్ అందజేసారు. ఊట్లపల్లి, కాట్రగుంట ఇంకా పలుచోట్ల ఒకే పేరు పలు చోట్ల ఉన్నట్లు, మరణించిన వారి పేర్లు కూడా ఉన్నట్లు, బ్రతికి ఉన్న వారు మరణించినట్లు, మహిళ స్థానంలో పురుషులు ఫోటోలు ఉండటం, ఇతర ప్రాంతాల్లోని వారు ఉండటం, మహిళల ఓట్లు కూడా ఉండడం ఇలాంటి పలు సవరణలు క్షేత్రస్థాయిలో వెళ్లి త్వరితగతిన పరిశీలించి సరిచేయాలని సూచించారు. మండలంలో 38 పోలింగ్ బూతులు, 27618 మంది ఓటర్లు ఉన్నారని తహశీల్దార్ తెలిపారు.

## చదువుతో పాటు క్రీడల పట్ల యువత శ్రద్ధ చూపాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 29, ప్రభాతవార్త



యువత చదువుతోపాటు క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజయం సాధించిన వారికి ఆయన బహుమతులను, నగదు చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో క్రీడాకారులను పెంచేందుకు కూడా ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. మన రాష్ట్రం ఆర్చరీ ఆటలపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలిపారు. ప్రతిపక్షాల వారు ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలను కూడా రాజకీయం చేశారని విమర్శించారు. యువత ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ నక్క భానుప్రియ , పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, వైస్ చైర్మన్ బాలయ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు కళ్యాణి, రాధమ్మ, నారాయణ, పూజారి లక్ష్మి, క్లబ్ అధ్యక్షులు కోటేశ్వర రావు, నాయకులు రాజారెడ్డి, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఓచే ప్రాథమిక పాఠశాల సందర్శన

తడ, జనవరి 29 ప్రభాతవార్త



తడ మండలం పెదమాంబట్టులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఉదయం మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు సందర్శించారు. విద్యార్థులకు సలహాలు సూచనలిచ్చారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల సాధన పుస్తకాలను సిలబస్ ప్రకారం రాయించి వాటిని దిద్ది ఉండాలని తెలియజేశారు. అదే గ్రామంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా అని ఆరా తీశారు. సిబిఎ–2 పరీక్షకుసంబంధించినఓఎంఆర్‌లను మంగళవారం మండల శాఖ కార్యాలయానికి చేర్చాలని తెలియజేశారు.

## లారీ బైక్ ఢీ . మహిళ మృతి



కోట, జనవరి 29 ప్రభాతవార్త

కోట మండలం వెంకనపాళెం గ్రామానికి చెందిన నాగమ్మ తన భర్త శంకరయ్యతో కలిసి సోమవారం ద్విచక్రవాహనంపై చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ దర్శించుకున్నారు. ఆమేరకు మొక్కు తీర్చుకుని తిరిగి వచ్చే క్రమంలో సిద్దవరం వంతెనపై కోట నుంచి సిద్దవరం వైపు వేళ్లుతున్న ఓ లారీ ఢీ కొనడంతో నాగమ్మ (48) అక్కడక్కడే ప్రాణాలు వదిలింది. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో తల్లి మృతి చెందాంతో ఆకుటుంభంలో విషాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్.ఐ.పి.నాగబాబు సంఘటన స్దలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైకాపాలో దళిత వర్గాలపై చిన్నచూపు

– టిడిపి ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్



బంగారుపాళ్యం, జనవరి 29 ప్రభాతవార్త:

వైఎస్ఆర్‌సిపిలో దళిత వర్గాలపై అగ్రవర్ణాలు చిన్నచూపు చూస్తున్నారని పూతలపట్టు టిడిపి ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్ ఆరోపించారు. సోమవారం బాబు ష్యురిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంను తుంబపాళ్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారం చేపడితే తాము చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు దళిత నియోజకవర్గ స్థానాలు మార్చుతున్నారని ఆరోపించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన నియోజకవర్గాల అభ్యర్థులు మాత్రమే మార్చుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు టిడిపి కార్యదర్శి కోదండయాదవ్, సర్పంచ్ ఉషశ్రీ, బూత్ ఇన్‌ఛార్జీ గురుస్వామి, ఉప సర్పంచ్ చిరంజీవి, మాజీ ఎంపిటిసీ వెంకటేశులు, జనసేన పార్టీ నాయకులు చిరంజీవి, మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్ గౌడు, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, పార్లమెంటు బిసీ కార్యదర్శి హరిప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షులు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల జాబితాలలో మార్పులు చేర్పులు పరిశీలించి అప్‌డేట్

– జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, జనవరి 29 ప్రభాతవార్త:

ఎన్నికల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా మరణాలు, జిరో, జంక్, డూప్లికేట్ ఓట్ల విషయంలో జాగ్రత్త వహించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి మంగళవారం సాయంత్రంలోపు నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. జెసి క్యాంపు కార్యాలయం నుండి జెసి పి.శ్రీనివాసులు సోమవారం ఆర్డీఓలు, తహసిల్దార్లు, బిఎల్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఓటర్ల విషయంలో వచ్చిన క్లైమ్‌లకు సంబంధించి క్షేత్ర స్థాయి విచారణ వేగవంతం చేయాలని, నేటి సాయంత్రానికి ఆన్‌లైన్ నివేదిక సిద్దం చేసి సమర్పించాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితుల్లోను లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## స్పందనకు 277 సమస్యలు

**చిత్తూరు, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా వ్యాప్తంగా వున్న ప్రజల నుండి 277 సమస్యలపై అర్జీలు అధికారులకు అందాయి. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డిఆర్ఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబం ధించి అత్యధికంగా 243, విద్యాశాఖ 4, పోలీసు శాఖ 2, మున్సిపల్ శాఖ 5, డిఆర్‌డిఏ 9, జిల్లా పరిషత్‌కు సంబంధించి 3 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అన్నప్రసాదానికి బియ్యం వితరణ

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఆలయంలో స్టార్ హోటల్స్ కన్నా మిన్నగా నాణ్యతతో కూడిన భోజనం అందిస్తున్న దేవస్థానంకు భక్తులు వితరణలు,విరాళాలు అందిస్తున్నారు.ఆదివారం శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన భక్త కిరణ్,స్వర్ణలత కుమారుడు తన్విష్ జన్మదిన సందర్భంగా వారు దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి 50బస్తాల బియ్యాన్ని విరాళంగా అందించారు.ఈ విరాళాన్ని దాతలు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా ఆలయానికి అందించారు. వారికి చైర్మెన్ ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. తన్విష్‌కు వేదపండితులచే ఆశీర్వచనాలు స్వామి అమ్మవార్ల ఆలయంలో పూజలు జరిపించారు.ఈ కార్యక్రమాల్లో తోకల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం సిబ్బందికి ఆదివారం ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఆదివారం వైద్యశిబిరాన్ని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. సుమారు 300 మందికి వైద్యశిబిరాలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు.శిబిరం ప్రారంభించిన చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతు ఎంజిఎం సంస్థల నిర్వాహకులు మల్లికార్జున్ నాయుడు ఆది నుంచి వ్యాపార రంగంలో రాణిస్తున్నారన్నారు. అంతేకాక సామాజిక సేవలో తన వంతు సేవల్ని అందిస్తున్నారని చైర్మెన్ వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఎంజిఎంకు చెందిన గూడ్లూరు మయూర్ డెప్యూటీ ఇఒ వెంకటసుబ్బయ్య, ఎసి మల్లికార్జున్ ప్రసాద్,సిబ్బంది, ఎంజిఎం ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వ పథకాలు చివరి వ్యక్తి వరకు చేర్చడానికే

వికసిత్ సంకల్పయాత్ర -బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



కేంద్రప్రభుత్వ పథకాలు చివరి వ్యక్తి వరకు చేర్చడానికే భారత్ వికసిత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద కుమార్ అన్నారు. బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాల మేరకు పట్టణంలోని పివి సచివాలయంలో ఆదివారం బాబుఅగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో నరేంద్రమోడీ గ్యారంటీల బస్ వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభను మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన లబ్ధిదారులతో కలసి నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, యువత సాధికార పొందితే మున్సిపాలిటీ శక్తివంతమైన ప్రాంతంగా ఎదుగుతుందని అన్ని ప్రాంతాలు వృద్ధి చెందితే భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలో అతిపెద్ద దేశంగా నిలుస్తుందన్నారు. కేంద్ర పథకాలను ప్రజా సంక్షేమ పథకాల్లో అర్హులైన లబ్ధిదారులెవరు పథకాల నుంచిబయకు రాకుండా చూడడమే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, రాష్ట్ర కిసాన్‌మోర్చా సభ్యులు ఎస్వీరమణ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఉత్తమ కళాదర్శకత్వ షార్ట్‌ఫిల్మ్‌గా రంగస్థలంలో..

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త




ఉత్తమకళా దర్శకత్వ షార్ట్ ఫిలింగా రంగస్థలంలో..ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కళా దర్శకత్వ విభాగంగా ఉత్తమ కళా దర్శకుడిగా ఈరంగస్థలంలో అనే షార్ట్‌ఫిల్మ్‌కి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఫిబ్రవరి 4న మహతి ఆడిటోరియంలో జరుగబోయే కార్యక్రమంలో అత్యుత్తమ పురస్కారం దక్కింది. ఈసందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రారెడ్డిలు తెలిపారు. ఈ షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు సన్‌మురళీ, ఛాయాగ్రహం చందు, డిఐ విశ్వనాథ్‌లు శ్రీకాళహస్తి వాసులు గర్వకారణం కావడం గర్వంగా ఉందని తెలిపారు.

## సేవా గుణాన్ని ప్రతి ఒక్కరు అలవరచుకోవాలి

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



ప్రముఖ సంఘసేవకుడు హెల్పింగ్‌హ్యాండ్స్ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా తల్లి అమినాబి స్వర్గస్తులైనారు. దీంతో పూసలవీధిలోని మునీర్‌బాషా నివాసం వద్ద దివ్యాంగులకు అన్నదానం, నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా తెలుగు దేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి తల్లి బొజ్జలబృందమ్మ విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మునీర్‌బాషా ప్రతినెల దివ్యాగులకి నిత్యావసర సరుకుల పంపిణీచేయడం సంతోషం అన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు పంపిణీచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా రాము

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా శ్రీకాళహస్తి పట్టణంలోని అరుణ మెడికల్స్ అధినేత రామును ఎన్నుకున్నారు. తిరుపతి పట్టణంలో అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన జిల్లా అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్ పదవిలకు ఎన్నికలు జరిగాయి. తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట, పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట మరియు భాకరాపేట ప్రాంతాల కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్‌లు పాల్గొన్నారు. ఈఎన్నికల్లో తిరుపతి జిల్లా అధ్యక్షులుడగా రత్నం, కార్యదర్శిగా రాము, ట్రెజరర్‌గా నరసింహారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ జిల్లా యూనియన్ మరియు ప్రతి డ్రగ్గిస్ట్ మరియు కెమిస్ట్ సమస్యల పరిష్కారం కోసం మరియు అసోసియేషన్ అభివృద్ధికోసం పనిచేస్తానన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

తొట్టంబేడు, జనవరి 28 ప్రభాతవార్త



పట్టణంలో ఆదివారం వివిఎస్ కళ్యాణమండపంలో ఫైడ్ ఇండియా కల్చర్ నృత్యోత్సవ్ ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి హజరయ్యారు.ఈసందర్భంగా ఆమె చిన్నారుల నృత్యప్రదర్శనను తిలకించి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పాత జ్ఞాపకాలను గర్తు చేసుకుని మాట్లాడుతూ తన ప్రదర్శన చూసి తాను చిన్నతనంలో నృత్యాన్ని చూసి తన కన్న నాట్యాన్ని చూసి కన్నీళ్ళు పెట్టుకున్నారు. భరతనాట్యప్రదర్శన చేసిన కళాకారులందరినీ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఫైడ్ ఇండియన్ కల్చర్స్ సీఈవో డాక్టర్ కోలా.వెంకటేశ్వరరావు, కళాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు భారీ ఎత్తున్న సిపాయి జన్మదిన వేడుకలు

పానగల్ నిండా ఫ్లెక్సీలు

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త




రష్ అధినేత,ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వన్నెకుల క్షత్రియులు ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 40వేల మంది వన్నెకుల క్షత్రియులున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంతో అవినాభావ సంబంధం ఉన్న ఎంఎల్సి సామాజిక సేవలో పాల్గొంటున్నారు. ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసారు.సుమారు 15 సంవత్సరాలుగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం రాజకీయాల్లో ఉన్నా హంగామాల్లేదు. అయితే ఈ ఏడాది సోమవారం జరిగే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుటకు సహచరులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9గంటలకు ఏర్పేడు మండల కేంద్రంలో కేక్ కట్ కార్యక్రమాలను సర్పంచ్ నల్లపాళెం శివయ్య ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తిలోని మిట్ట కండ్రిగ వద్ద రైల్వేస్టేషన్ వద్ద తలపాల దామోదర్‌రెడ్డి, ఎపిసీడ్స్ కూడలి వద్ద కార్మిక నాయకుడు మునెయ్య, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి వద్ద మాజీ కౌన్సిలర్ ఆర్కాటుముత్తు , బుజ్జిరెడ్డి, అగ్రహారం కూడలి వద్ద వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి,పట్టణంలోని పెండ్లి మండపం వద్ద కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. వైయస్ఆర్ కూడలి విగ్రహం వద్ద వన్నెకుల క్షత్రియ సంఘం సామాజిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆయన జన్మదిన వేడుకలకు పట్టణంలోని పానగల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

## వాకర్స్‌చే యోగసాధకులకు యోగామృతం పంపిణీ

వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి టౌన్, జనవరి 28, ప్రభాతవార్త



తిరుపతి కరకంబాడిరోడ్డు నందలి వినాయకసాగర్ నందు వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ యోగ గురువు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో యోగసాధకులకు యోగామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణాప్రసాద్ విచ్చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మాంసాహారంపై మక్కువ పెంచుకొని జంక్ ఫుడ్‌ను అలవాటు చేసుకొని జొమాటో, స్విగ్గీలపై ఆధారపడి శరీరాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో ఉచితంగా యోగవిద్యను నేర్పిస్తూ ప్రతి ఆదివారం మాంసాహారం బదులు యోగామృతం అంటే వివిధ పోషక విలువలు గల శాఖాహారంను ఉచితంగా అందించి వారి ఆరోగ్యపరిరక్షణకు యోగసాధకులు నడుంకట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఆ తరువాత మంచి యోగసాధకులను గుర్తించి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రిటైర్డ్ డిప్యూటీ ఇఒ రామస్వామి టిషర్ట్‌లను బహుకరించారు. అటుపిమ్మట వాకర్స్‌కు, యోగసాధకులకు ఆర్కాట్ కృష్ణప్రసాద్ చేతులు మీదుగా యోగామృతాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కాట్ కృష్ణప్రసాద్, యోగ గురువు వెంకటేశ్వర్లు, గుత్తా బాలాజీ, రామస్వామి, కృష్ణంరాజు, నరసింహయ్య, చంద్ర, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి ట్రస్ట్ పై వచ్చిన ఆరోపణలలో వాస్తవాలు లేవు

తిరుపతి టౌన్, జనవరి 28, ప్రభాతవార్త



శ్రీ వాణి ట్రస్ట్ పై వచ్చిన ఆరోపణల మీద సమగ్ర విచారణ చేసి ఆరోపణలలో వాస్తవాలు లేవని, దీనిపై నలబై రెండు పేజీల బుక్లెట్‌ను ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం శ్రీవాణి ట్రస్ట్ పై ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ అధ్యక్షులు జోగిరెడ్డి భాస్కర్ రెడ్డి సభ్యులు శ్రీధర్, ఆదిమూలం శేఖర్, మూర్తి తదితరుల చేతుల మీదుగా ప్రజలకు తెలిసేలా.. ప్రెస్ క్లబ్ వేదికగా విడుదల చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని టిడిపి నాయకులు సమావేశం ఉండడంతో తెలుగుదేశం పార్టీ నేతలకు ఈ బుక్లెట్‌ను అందజేసారు. ఇంకా ఏమైనా శ్రీవాణి ట్రస్ట్ పై అపోహాలు ఉంటే నివృత్తి చేస్తామని, ఇతర వివరాలకు, సందేహాలకు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సంప్రదించి నివృత్తి చేసుకోగలరని సమాజానికి తెలిసే విధంగా పిలుపునిచ్చారు.

## లయన్స్ క్లబ్‌చే అంధ విద్యార్ధులకు అన్నదానం

తిరుపతి టౌన్, జనవరి 28, ప్రభాతవార్త



లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి 7 హిల్స్ ఆధ్వర్యంలో తిరుపతి, తిరుచానూరు రోడ్డు నందు నవజీవన్ బ్లైండ్ హోమ్ నందు గల సుమారు 200 మంది అంధ విద్యార్ధులకు, వృద్ధులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంధ పిల్లలు అంటే భగవంతునితో సమానమని, అటువంటి చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి 7 హిల్స్ అన్నదానంతో చేయూతనివ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి 7 హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కోశాధికారి బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, తేజ శ్రీ, హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

## దళితకాలనీల్లో టిడిపి నేతల విస్తృత ప్రచారం

నారాయణవనం, జనవరి 28 ప్రభాతవార్త :



తెలుగుదేశం అధిష్టాన ఇచ్చిన పిలుపు మేరకు సత్యవేడు నియోజకవర్గం టిడిపి ఇంచార్జీ డాక్టర్ హెలెన్ ఆదేశాలతో ఆదివారం మండలంలో టిడిపి నాయకులు ప్రచారాన్నిప్రారంభించారు. ముందుగా నైనారుకండ్రిగ పంచా యతీలోని ఆదిఆంధ్రవాడ, నైనారుకండ్రిగ ఎస్సీకాలనీ, ఎస్టీకాలనీల్లో మండల టిడిపి అధ్యక్షులుపి గిరిబాబు ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి దళిత టిడిపి నాయకులుటిషణ్ముగం,కుమార్,గోపి,మునివేలు తదితరులు ఇంటింటికి వెళ్లి దళితులను ఉత్తేజ పరిచారు.

## టీడీపీలోకి 50 కుటుంబాలు

వడమాలపేట, జనవరి 28 ప్రభాతవార్త:



మండలంలోని పాదిరేడు దళితవాడలో 50 కుటుంబాల వారు ఆదివారం నగరి ఇన్‌చార్జి గాలిభానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉదయం గ్రామానికి వచ్చిన భానుప్రకాష్‌కి గ్రామస్తులు ఘన స్వాగతం పలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా యువతకు ఉపాధి అవకాశాలు రావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని నమ్మి టీడీపీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. రాజేష్, అనిల్, సురేష్, మహేష్, పరశురాం, దాము, అశోక్, మునేంద్ర,చక్రవర్తి,మదన్, హేమాద్రి, లోకేష్, మనోహర్, విజయ్ తులసిరాం, అనిల్, కార్తీక్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

## బట్టర్‌పై లైట్ల స్థంభాలు ఏర్పాటుకు సన్నాహాలు

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగుమాడావీధుల్లో ఆకర్షితమైన బట్టర్ ఫ్లై లైట్లు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గత ఏడాది శివరాత్రి నాటికే అండర్ గ్రౌండ్ కేబుల్ పూర్తి చేసి నాలుగుమాడావీధుల్లో పురాతన స్థంభాలను తొలగించాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆదేశించారు.రూ.7కోట్లతో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను విద్యుత్‌శాఖ నిర్వహించింది. కాంట్రాక్టు తీసుకున్న సంస్థ పనులను నాన బెట్టి నానబెట్టి మమా అనిపించుకున్నారు.అయితే ఇంకా కొన్ని విద్యుత్ స్థంభాలను ఇంకా తొలగించలేదు. వాటికి ఏరాజకీయ నాయకుని అండ ఉందో ఏమో కానీ వాటి జోలికి విద్యుత్ శాఖ పోవటం లేదు. కోట్లు వెచ్చించి దిష్టిబొమ్మల్లా విద్యుత్ స్థంభాలు దర్శనమిస్తున్నాయి.కాగా బట్టర్ ఫ్లైలైట్లను దేవస్థానం ఏర్పాటు చేయాలని ఎంఎల్ఏ కోరారు. ఈ లైట్లు ఏర్పాటుకు రూ.2కోట్లు అవసరమని ప్రతిపాధనలు పంపారు. నిధుల విడుదలకు అభ్యర్థించారు. కానీ దేవాదాయశాఖ నిధులుమంజూరు చేయాలేదు. అయితే ఆదివారం ఇంజనీరింగ్ విభాగం అధికారి రాజేశ్వరి నాలుగుమాడావీధుల్లో స్థంభాలు ఏర్పాటుకు కొలతలు తీసుకున్నారు. అయితే పాత విద్యుత్ స్థంభాలను అలాగే ఉంచి బట్టర్‌ప్లై లైట్లను ఏర్పాటుచేసిన అందగించదనే అభిప్రాయం ఉంది.

## ఉమ్మడిగా గెలుస్తాం!శ్రీకాళహస్తి పరువు కాపాడుదాం!!

ఆత్మీయ సమావేశంలో వినూత

శ్రీకాళహస్తి,జనవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం,జనసేన ఉమ్మడిగా గెలుద్దాం. ఈ దివ్యక్షేత్రం పరువు ప్రతిష్టలను కాపాడుదామని ఆదివారం శ్రీరామనగర్ కాలనీలోని రోటరీ క్లబ్ భవవనంలో ఏర్పాటు చేసిన జనసేన ఆత్మీయ సమావేశంలో వినూత కోట అన్నారు.ఈ నియోజకవర్గంలో నేడు అరాచక పాలన సాగుతుందన్నారు.ఎక్కడ చూసిన భూకబ్జాలు,ఆక్రమణలు,ప్రశ్నిస్తే పోలీసు కేసులతో పాలన సాగుతుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా ఇంటింటికి వెళ్ళి నేడు జరుగుతున్న ఆరాచకాలను వివరిస్తామన్నారు. తాము ప్రజల కోసం పోరాడితే మాపై అక్రమ కేసులు అరెస్టులు చేసారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అభ్యర్థి ఎవరైనా విజయమే లక్ష్యంగా పని చేస్తామని వినూత వివరించారు.తమ పార్టీలో జనసేనలు పైసలు కోసం పని చేస్తే వారు లేదన్నారు.పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పేద ప్రజల అభివృద్ధికి, అభ్యున్నతికా పాటు పడుతున్నామన్నారు. అలాగే శ్రీకాళహస్తిలోని మీడియాకు ఉచితంగా వారి ద్విచక్రవాహనాలకు పెట్రోల్, కమ్యూనిటి హాల్,పక్కా ఇళ్ళు తామే నిర్మించి ఇస్తామని వినూత ప్రకటించారు. తాము చెబుతున్నదంతా పవన్ కళ్యాణ్ ఆలోచనలని వివరించారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండిరాఘవయ్య, ఐటి కోఆర్డినేటర్ కావలిశివకుమార్, జనసైనికులు అశోక్, దిలీప్, మునిబాబు, నాయకులు చెంచుమని, తోటగణేష్, పేట చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, పేటచిరంజీవి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, కవిత, సురేష్, రాజేష్, గురవయ్య, జ్యోతిరాం, హేమంత్‌గౌడ్, జనసైనికులు పాల్గొన్నారు

## ఉత్తమ ఆర్‌పిగా సత్యవాణి

శ్రీకాళహస్తి, జనవరి 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డులో సమర్ధవంతంగా పనిచేస్తున్న ఆర్‌పి చింతామణి సత్యవాణిని పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆమెను దుశ్శాలువ పూలమాలతో సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిఓ అమ్మాజీ, సిఎంఎం ప్రసాద్, ఆర్ఓ నారాయణరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధిహామీ సామాజిక తనిఖీ

పనితీరును మెరుగుపరుచుకోండి..! డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్

చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త:



స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉపాధిహామీ నిర్వహణలో ఆశించిన ఫలితాలు దక్కడం లేదనీ, పనితీరును మెరుగుపరుచుకోవాలని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలో రూ.6 కోట్ల 31 లక్షల విలువైన పనులు జరిగినట్లు తెలిపారు. ఇందులో రూ.4.50 కోట్లు కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ.1.81 కోట్లు సిసి రోడ్డు మెటీరియల్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. సామాజిక తనిఖీలో కొన్ని పొరబాట్లు చోటు చేసుకున్నాయన్నారు. దీంతో ఫైన్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిడిఓ బాలాజీ నాయక్, ఏపిడి డాక్టర్ పద్మావతీ, డివిఓ భాగ్యలక్ష్మి, ఎస్ఆర్‌పి నాగరాజు, అంబుడ్స్‌మెన్ రాసరాయుడు, ఏపిఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి కుటుంబాలకు చెవిరెడ్డి పెళ్ళి కానుక

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త:



నా తండ్రి, ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేదింటి కుటుంబాలకు పెళ్ళి కానుకలు పంపినట్లు వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. స్థానిక పాతపేట, బి.డి.కాలనీకి చెందిన షేక్ సయ్యద్ భాషా దంపతుల కుమార్తె షేక్ అప్సానకు పాకాల మండలం, దామల్ చెరువుకు చెందిన నాగూర్ కుమారుడు నజీర్‌కు, అదేవిధంగా బిడి కాలనీకి చెందిన సానియా, అగరాలకు చెందిన మస్తాన్‌కు వివాహం జరిపించ పెద్దలు నిర్ణయించారు. ఈ సందర్భంగా వధూవరులకు హర్షిత్ రెడ్డి పెళ్ళికానుకలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పెళ్ళి కానుకలు పంపిన ఎంఎల్ఏకి, అందజేసిన హర్షిత్ రెడ్డికి నవవధూవరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, సిద్ధిఖ్ భాషా, సోనూ, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా అధికారంలోకి రాగానే ఉపకులాల వారీగా నిధులు

-సత్యవేడు బీసి సెల్ అధ్యక్ష్యుడు పరంధామయ్య

సత్యవేడు, జనవరి 28, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఉపకులాల వారీగా నిధులు కేటాయింపు జరుగుతుందని సత్యవేడు నియోజకవర్గ బీసిసెల్ అధ్యక్ష్యుడు పరంధామయ్య పేర్కొన్నాడు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం సత్యవేడులో పరంధామయ్య ఆధ్వర్యంలో జయహో బీసి కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో బీసి సామాజికవర్గ ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. బీసి అభ్యున్నతికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అయితే బీసిలకు సముచితస్థానం కల్పించడంతో పాటు వారి ఆర్ధిక ఉన్నతికి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు చేపడతామని తెదేపా ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అంతకుమునుపు ర్యాలీగా గడియారవ కూడలి వద్దకు చేరుకుని మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, ఇన్‌ఛార్జ్ హెలెన్, నాయకులు సుంధరరామిరెడ్డి, మస్తాన్, సంతోష్, ఫృథ్వి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంగ్లోపాధ్యాయుడికి సుభాస్‌చంద్రబోస్ మెమోరియల్ అవార్డు

ఏర్పేడు,జనవరి 28,ప్రభాతవార్త;

మండలంలోని బండారుపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆంగ్లోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.సుబ్రమణ్యంకుఆదివారంసుభాస్‌చంద్రబోస్‌మెమోరియల్‌అవార్డుకు వర్చ్యువల్ పద్దతిలో ఎంపిక అయినట్లు సహారా చారిట్రబుల్ ట్రస్ట్ ఉత్తరప్రదేశ్ వ్యవస్థాపకులు డాక్టర్ అఖ్లాక్ అహమ్మద్ తెలిపారు. వివిధరంగాల్లోరాణిస్తున్నవారికిఈఅవార్డులనుదేశవ్యాప్తంగావర్చ్యువల్‌పద్దతిలోఅందివ్వడంజరుగుతుంద న్నారు.

## జగనన్న ప్రభుత్వ విద్యావిధానం భేష్

ఏర్పేడు,జనవరి28,ప్రభాతవార్త;



జగనన్న ప్రభుత్వ విద్యావిధానం విద్యార్థుల అభివృద్ధికి గొప్పగా ఉపయోగపడుతున్నదని వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు శ్రీమతి మద్దిల ముని శారద పేర్కొన్నారు. మండల కేంద్రం ఏర్పేడు శివా పబ్లిక్ స్కూల్ ఆవరణలో వైఎస్సార్ ఇంటెలెక్చువల్ ఫోరం జిల్లా అధ్యక్షులు కాపిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నేటి బడి మార్పుల ఒడి అనే అంశంపై చర్చాకార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు నేడు అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో అనేక విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చి ఆంగ్లవిద్యను బోధిస్తున్నారు. అంతే కాకుండా విద్యార్థులకు మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా పేద విద్యార్థులు కూడా ఫీజులు కట్టే పని లేకుండా ఉచితంగా ఆంగ్ల విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. కాపిరెడ్డి కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యులు బత్తిశెటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈసారి వచ్చే ఎన్నికల్లో జగనన్నకే ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టీచర్ చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, జానకిరాముడు, సుధాకర్, వెంకటముని, సురేష్, చెంచురామ్, నరసింహా, సతీష్‌కుమార్, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపితోనే బిసిల అభ్యున్నతి

టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 28 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీతోనే బిసిలు అభ్యున్నతి సాధించగలరని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జయహో బిసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత మంది యాదవులు ఆయనకు మేకపిల్లను బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిసిలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో వైసిపి ఆగడాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులను బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఏ పంపిణీ చేసేది పథకాలు కావనీ, ఆయన పాపాలను ప్రజలకు పంచిపెడుతున్నట్లు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తుడా మాజీ చైర్మన్ నరశింహ యాదవ్, జనసేన నియోజకరవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు సంజీవి హరి, నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, సాయిప్రసాద్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, ప్రకాష్ యాదవ్, జీవరత్నం, మాదవయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

**టిడిపిలోకి వలసలు** వైసిపి నుండి టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయి. వైసిపికి పట్టు కలిగిన నెన్నూరు నుండి యువ నాయకుడు దినేష్‌తో పాటు 15 మంది, గంగిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ రోజా భర్త వాసు ఆధ్వర్యంలో16మందిఆదివారంటిడిపితీర్థంపుచ్చుకున్నారు. వీరికి పులివర్తి నాని కండువాలుకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సి.కె.పల్లి నుండి పలువురు జయహో బిసి సభకు సంఘీబావం తెలిపారు.

## ఉప్పిలివంకలో జల్లికట్టు

రామచంద్రాపురం, జనవరి 28 ప్రభాతవార్త:



ఉప్పిలివంకలో ఆదివారం జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటాయి. రైతులు తమ పశువుల కొమ్ములకు రంగులద్ది అందంగా అలంకరించారు. కొయ్య పలకతో చెక్కిన పలకకు రంగుల కాగితాలను అతికించి పశువుల కొమ్ములకు కట్టి జనంలోకి వదలి డప్పులతో బెదిరించారు. పశువుల కొమ్ములకు కట్టిన పట్టీలను సొంతం చేసుకోవడానికి యువత పోటీపడటంతో పలువురు స్వల్పగాయాలపాలయ్యారు. ఈ సంబరాలకు మండల పరిసర గ్రామాల నుండి, పొరుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

## భవిష్యత్తు కాంగ్రెస్‌పార్టీదే

-వైఎస్ షర్మిలను సన్మానించిన చిట్టిబాబు

తిరుపతి,జనవరి 28ప్రభాతవార్త:



రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్‌పార్టీయేనని, ప్రజలు కూడా ఇందుకు సిద్దంగా ఉన్నారని పిసిసి ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు అన్నారు. పిసిసిచీఫ్ వైఎస్ షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని అడ్డుకోవడం మూడు పార్టీలకు సాధ్యంకాదన్నారు. భవిష్యత్తు రాజన్న ముద్దుబిడ్డ షర్మిలతోనే సాధ్యమన్నారు. రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా వైఎస్ షర్మిలతోనే కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని చిట్టిబాబు ధీమా వ్యక్తం చేశారు. రాజన్న పాలనను తిరిగి ఆంధ్రలో తీసుకురాగల సత్తా ఆ మహానేత ముద్దుబిడ్డ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలదేనని గౌడపేర చిట్టిబాబు విశ్వాసం వ్యక్తం చేశారు ఆదివారం తిరుపతిలో జరిగిన తిరుపతి,చిత్తూరు జిల్లాల కాంగ్రెస్ నేతలు,కార్యకర్తల సమావేశంలో హాజరయ్యేందుకు వచ్చిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలను పిసిసి ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు కలిసి దుశ్శాలువతో సన్మానించారు.

